ముంచిన మొంథా


ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ కొనుగోలు కేంద్రంలో వర్షపు నీటిని తొలగిస్తున్న రైతులు


మెట్‌పల్లి మండలం మేడిపల్లిలో నేలవాలిన వరి

నేల వాలిన వరి పైరు
కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
రహదారులు, కల్వర్టులపై నుంచి వరద నీరు

జగిత్యాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో బుధవారం జిల్లాలోని పలు మండలాల్లో వరి పైరు నేలవాలింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో కురిసిన వర్షాల వల్ల చేతికి వచ్చిన వరి పైరు నేల వాలింది. సుమారు 2000 ఎకరాల్లో వరి నేల వాలినట్లు అంచనా ఉంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో విక్రయానికి సిద్దంగా ఉంచిన ధాన్యం తడిచి పోయింది. ధాన్యం కుప్పల వద్దకు వర్షపు నీరు వచ్చి చేరడం, వర్షం నీటికి ధాన్యం కొట్టుకపోవడం వల్ల రైతులు ఇక్కట్లు పాలయ్యారు. జిల్లాలో సుమారు 2,500 క్వింటాళ్ల ధాన్యం తడిచినట్లుగా అంచనా ఉంది. సామాన్య జన జీవనానికి కొంత అంతరాయం ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా ముసురుతో కూడిన వర్షం కురిసింది.

జిల్లాలో ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అత్యధికంగా ఎండ పల్లిలో 35మిల్లీ మీటర్లు, బుగ్గారం మండలం సిరికొండలో 17.3 మిల్లీమీటర్లు, మేడిపల్లిలో 16.3 మిల్లీమీటర్లు, కొడిమ్యాల మండలం తిరుమలాపూర్‌లో 16, కొడిమ్యాల మండలం పూడూరు, జగిత్యాల రూరల్ మండలం పొలాస, మల్యాలలో 15, ధర్మపురి మండలం బుద్దేశుపల్లిలో 14.3, జగిత్యాలలో 13.5, సారంగ పూర్‌లో 13.3, రాయికల్ మండలం అల్లీపూర్‌లో 11.5, కథలాపూర్‌లో 10.8, వెల్గటూరులో 8, బీర్‌పూర్ మండలం కొల్వాయిలో 5.3, కోరుట్లలో 3, కోరుట్ల మండలం అయిలాపూర్‌లో 2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. మెట్‌పల్లి మండలం జగ్గసాగర్‌లో 0.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అత్యల్పంగా మల్లాపూర్ మండలం రాఘవపేట, భీమారం మండలం గోవిం దారంలో 0.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

వివరాలు 8లో..


ఇబ్రహీంపట్నంలో నేలవాలిన వరి

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
కలెక్టర్ సత్య ప్రసాద్

తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురి సే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్యప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాన్ కారణంగా జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులంతా అందు బాటులో ఉండాలని ఆదేశించారు. నీటి వనరులలో నిల్వలను ఎప్పటి కప్పుడు పర్యవేక్షించాలని, ఎక్కడ ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. జిల్లావ్యాప్తంగా మత్స్యకారులు ఎవరూ చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. కల్వర్టులు దాటవద్దని, నీటి వనరుల సమీపంలో ప్రయాణాలు చేయవద్దని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని పేర్కొన్నారు. వర్షాల ప్రభావం, నీటి ప్రవాహాల స్థితిపై సమాచారం సేకరించి, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాగులు, వంతెనలు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సూచించారు. అధికారులంతా జాగ్రత్తగా విధులు నిర్వర్తించి ఎక్కడ ఎలాంటి తప్పిదాలకు చోటు ఇవ్వకుండా చూసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.


జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్‌లో నేలవాలిన వరి పంట

కాల్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి
-కలెక్టర్ సత్యప్రసాద్


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సత్య ప్రసాద్, అధికారులు

జగిత్యాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం కొనుగోళ్లలో ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కాల్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం వరి ధాన్యం కొనుగోళ్ల సందర్భంగా రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్‌సెంటర్ టోల్‌ఫ్రీ నంబరు 18004258187కు కాల్ చేసి సమస్యను విన్నవించాలన్నారు. వెంటనే అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, సివిల్ సప్లయి కార్పొరేషన్ జిల్లా మేనేజర్ జితేంద్రప్రసాద్, డీఎస్‌వో జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గోదావరి హారతి

ధర్మపురి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో బుధవారం గోదావరి హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ వేద పండితులు, అర్చకులు, సిబ్బంది, మహిళలు మంగళ వాయిద్యాలు వెంట రాగా గోదావరి నదికి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం నది వద్ద ఏటా నిర్వహించే విధంగా ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ నేతృత్వంలో ఆలయ అర్చకలు సాంప్రదాయ రీతిలో, శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ముఖ్య అర్చకులు నంబి నరసింహమూర్తి, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్ కుమార్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మల్యాల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని నూకపల్లి మోడల్ స్కూల్‌లో గంటల ప్రాతిపదికన బోధించడానికి ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ పౌరశాస్త్రం ఇంగ్లీష్ మీడియంలో బోధించడానికి సంబంధిత సబ్జెక్టులో పీజీ, ఎంఏ పొలిటికల్ సైన్స్ లేదా పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌తో పాటు బీఈడీ సోషల్ మెథడాలజీ అర్హత గల వారు సోమవారం మోడల్ స్కూల్‌లో దరఖాస్తులు అందించాలని పేర్కొన్నారు.

నిత్యం వ్యాయామంతో ఆరోగ్యం

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి నిత్యం వ్యాయామం చేయడం వల్ల మెరుగైన ఆరోగ్యం పొందవచ్చని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం జగిత్యాల పట్టణంలోని 25వ వార్డులో హనుమాన్ వ్యాయమ శాలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి రోజు తప్పనిసరిగా వ్యాయం చేయాలని దాని వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో పాటు అనేక దీర్ఘకాలిక వ్యాదుల భారిన పడకుండా ఉండవచ్చని అన్నారు. అనంతరం వ్యాయమశాలలో ఏర్పాటు చేసిన హనుమాన్ విగ్రహానికి ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అర్ముళ్ళ పవన్, చందా పృథ్వీరాజ్, జుంబర్తి రాజ్‌కుమార్, నాచుపల్లి రెడ్డి, రమణ, ఒంటిపులి రాము పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన డీపీవో


కలెక్టర్ సత్యప్రసాద్‌కు పూలమొక్క అందిస్తున్న డీపీవో రేవంత్

జగిత్యాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 నియామకాల్లో డీపీవోగా ఎంపికైన రేవంత్ బుధవారం కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో గల జిల్లా పంచాయతీ విభాగం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం మర్యాద పూర్వకంగా కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసి పూలమొక్కను అందించారు. గ్రూప్-1లో ప్రతిభ కనబరిచి డీపీవోగా ఎంపికైన రేవంత్‌ను కలెక్టర్ సత్యప్రసాద్ అభినందించారు. ఈకార్యక్రమంలో డీపీవో మదన్ మోహన్ పాల్గొన్నారు. కాగా డీపీవో రేవంత్‌కు పలువురు మండల పంచాయతీ అధికారులు, గ్రామ కార్యదర్శులు, కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది స్వాగతం పలికారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి
-కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అర్హులకు చేరవేస్తూ అంకితభావంతో విధులను నిర్వర్తించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ సత్య ప్రసాద్‌ను జిల్లాలో ఇటీవల నూతనంగా పలు మండలాల్లో బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓలు మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ సత్య ప్రసాద్‌కు పూలమొక్కలను అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల ఆదేశాలు, ప్రభుత్వ మార్గదర్శకాలను స్వీకరిస్తూ బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. నూతనంగా మేడిపల్లి, ఇబ్రహీంపట్నం, బుగ్గారం, మల్లాపూర్, పెగడపల్లి, వెల్గటూరు ఎంపీడీఓలుగా బాధ్యతలు స్వీకరించిన అంజుమ, గణేష్, సుమంత్, శ్రీకాంత్, ప్రేమ్‌సాగర్, వెంకటప్రసాద్‌లను అభినందించారు. ఈకార్యక్రమంలో జడ్పీ సీఈఓ గౌతమ్ రెడ్డి, జడ్పీ డిప్యూటీ సీఈఓ నరేశ్, డీపీఓ మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

కొడిమ్యాల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు తమ పశువుల సంరక్షణకు ఉచిత టీకాలు వేయించాలని జిల్లా పశు వైద్యాధికారి ప్రకాష్ అన్నారు. బుధవారం మండలంలోని కోనాపూర్ గ్రామంలో పశు వైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని జిల్లా పశు వైద్యాధికారి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాడి రైతులతో మాట్లాడుతూ టీకాల ద్వారా పశువులకు రక్షణ లభిస్తుందన్నారు. పశువుల ఉత్పత్తిలో మెరుగుదల కలుగుతుందని అవగాహన కల్పించారు. పాడి రైతులు ఎలాంటి అపోహలు నమ్మకుండ కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయంతో నిర్వహిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారులు రాకేష్, కమలాకర్, సహాయక సిబ్బంది రాజేశం, రవీందర్‌బాబు, రాజు, ఉదయ్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో గణేష్ లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని కొజన్ కొత్తూరు గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ళను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి లబ్ధిదారులు బిల్లులు పొందాలని సూచించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఎర్దండీ గోదావరి నది పరివాహ ప్రాంతాన్ని పరిశీలించారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నుంచి క్రస్ట గేట్ల ద్వారా నీరు విడుదల వుతున్నందు వల్ల తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఏపీఓ కొమురయ్య, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమిస్తాం
ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మాడవేణి సునీల్


ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడు దల చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మాడవేణి సునీల్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం విడుదల చేయకుంటే సీఎం గద్దెదిగే వరకు ఉద్యమిస్తామని ఏబీవీపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఫీజురీయింబర్స్ బకాయిల విడుదలలో జాప్యాన్ని నిరసిస్తూ జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక తహసీల్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించి, దహనం చేశారు.

ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మాడవేణి సునీల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు బకాయిగా ఉన్న రూ.8500కోట్ల రూపాయలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్, ఫీజురీయంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల వేలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. పై చదువులు కొనసాగించే మార్గంలేక అనేక మంది విద్యార్థులు కుటుంబ పోషణకోసం కూలీ పనులకు వెళ్లాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం నుంచి బకాయిలు విడుదల కాని కారణంగా డిగ్రీ పట్టా కోసం కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా కళ్లు తెరిచి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, తక్షణమే రూ. 8500 కోట్ల ఫీజురీయంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో విద్యార్థి పరిషత్ ఉధృతంగా పోరాటం చేసి, సీఎం రేవంత్ రెడ్డి గద్దె దిగే వరకు ఊరుకోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి నిఖిల్, వివిధ హోదాల బాధ్యులు మారుతి, విశ్వంత్, మనోజ్, సిద్దార్థ, మణిదీప్, హర్ష, తిరుపతి, కార్తీక్, మహంత్ తదితరులున్నారు. సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన ఏబీవీపీ బాధ్యులను పోలీసులు అరెస్టుచేసి, స్థానిక పట్టణ ఠాణాకు తీసుకెళ్లారు.

ఉపాధ్యాయుడిని నియమించాలి

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి)29: మండలంలోని కోనరావుపేట గ్రామంలోని ప్రైమరీ పాఠశాలకు ఉపాధ్యాయుడిని కేటాయించాలని గ్రామస్థులు జిల్లా అధికారులను కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని విద్య ఉన్నత అధికారులకు గ్రామ నాయకులువినతిపత్రం అంద జేసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా గ్రామశాఖ నాయకుడు జక్కని పరాందాము మాట్లాడుతూ గ్రామంలోని ప్రైమరి పాఠశాలలో 50 మంది విద్యార్థులు గాను ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా ఒక ఉపాధ్యాయురాలు వెంకట్రావుపేట గ్రామానికి వెళ్లారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని జిల్లా ఉన్నత విద్యాధికారులను కోరడం జరిగిందన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో పాఠశాల కమిటీ సభ్యుడు బత్తుల రమేష్ ఉన్నారు.

ఎంపీడీవోకు సన్మానం

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన మోత్కురి సరేష్‌ను మండలంలోని కాంగ్రెస్ నాయకులు శాలువలతో ఘనంగా సన్మానించారు. బుధవారం మెంట్‌పల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సురేష్ మాట్లాడుతూ మండలాభివృద్ధికి సహకరించాలన్నారు. గ్రామాల్లో ఎమైన సమస్యలు ఉంటే నేరుగా తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జక్కని పరందాములు, నేరళ్ల శ్రీధర్, చిలివేరి దీలిప్ పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి
ఎస్ఈ సుదర్శనం



జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో కుండపోతగా కురు స్తున్న అతి భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల సర్కిల్ సూపరిండెంట్ ఇంజ నీయర్ బి.సుదర్శనం సూచించారు. భారీ వర్షాల వలన విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఎక్కువగా ఉన్నందున విద్యుత్ వినియోగదారులందరూ అత్యంత అప్రమత్తతో ఉండి, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. విద్యుత్ భద్రత కోసం వర్షాలు పడుతున్న సమయంలో లేదా తడి ప్రదేశాల్లో తడిగా ఉన్న చేతులతో స్విచ్‌లు, మీటర్లు, ప్లగ్‌లు, లేదా వైర్లు తాకవద్దని, ఎక్కడైనా తెగి పోయిన విద్యుత్ తీగలు కనిపించినప్పుడు వాటి దగ్గరికి వెళ్లకుండా, వెంటనే సమీప లైన్‌మెన్‌కి లేదా 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు. తక్కువ ఎత్తులో వెళ్లే విద్యుత్ తీగల కింద వాహనాలు నడపవద్దని, పశువులను తీసుకెళ్ల వద్దన్నారు. పిల్లలను విద్యుత్ పరికరాల దగ్గర ఆడనీయకుండా దూరంగా ఉండేట్లు చూడాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో నీటిలో మునిగిన విద్యుత్ పరికరాలను తాకవద్దని ప్రజలకు సూచనలు చేశారు.

కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతోనే అభివృద్ధి

- కలెక్టర్లు క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలి
- కేంద్ర పథకాలపై ప్రతినెలా ప్రగతి నివేదిక మీడియాకు ఇవ్వండి
- కరీంనగర్‌లో యూజీడీ పేరుతో నిధులన్నీ నాశనం చేశారు
- 'దిశ' సమీక్షలో అధికారులపై కేంద్రమంత్రి హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆగ్రహం

7

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
బీడీ కార్మిక ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోవర్ధన్


సమావేశంలో మాట్లాడుతున్న బీడీ వర్కర్ ఫెడరేషన్ సభ్యులు

కోరుట్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బీడీ కార్మిక ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోవర్ధన్ డిమాండ్ చేశారు. బీడీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఢిల్లీలో ధర్నాకైనా సిద్ధమని ఆయన అన్నారు. బుధవారం కోరుట్ల పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో బీడి పెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్వహించి పలు కార్యక్రమాలపై తీర్మానం చేశారు. ఈ సందర్భంగా బీడీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గోవర్ధన్, సుతారి రాములు మాట్లాడా రు. బీడీ కార్మికులకు వెయ్యి నుంచి రూ.5000 పెంచాలని డిమాండ్ చేశారు. 6.5 కోట్ల మంది పీఎఫ్ సమస్యలు ఎదుర్కొటుంన్నారని వెంటనే కేంద్ర కార్మిక ఉపాధి కల్పన మంత్రి స్పందించాలన్నారు.

కేంద్ర మంత్రి వర్గంతో చర్చించి బీడీ కార్మి కులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ రెండో వారంలో చలో ఢిల్లీ కార్యక్రమం కార్మికుల చేత చేపడుతున్నట్లు ప్రకటించారు. బీడీ కట్టపై డేంజర్ గుర్తు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ నాయకులు మౌలానా, కొక్కుల శాంత, అనసూర్య, పూల గోదావరి బత్తిని సదానందం, బానుచందర్, ముక్రం, కదారి రాములు, వేణు, ఎన్నం రాధ, రాంగారెడ్డి, అన్నం రాధ, సుంకలపల్లి శాంతవ్వ అందే వంశీకృష్ణ పాల్గొన్నారు.

దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ రాంచందర్‌రావు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బస్టాండ్, కలెక్టరేట్ ప్రాంతాల్లో రాత్రివేళల్లో ఒంటరిగాఉన్న వ్యక్తుల చేతిలోని సెల్‌ఫోన్‌లు, హాండ్‌బ్యాగ్‌లను దొంగిలిస్తూ తప్పించుకు తిరుగుతున్న నలుగురు నిందితులను బుధవారం అరెస్టు చేశామని కరీంనగర్ వన్‌టౌన్ సీఐ రాంచందర్‌రావు తెలిపారు. నిందితులు సుల్తానాబాద్‌కు చెందిన మహ్మద్ గౌస్‌బాబా(30), సుభాష్‌నగర్‌కు చెందిన మహ్మద్ అబిద్(22), సంగారెడ్డికి చెందిన మద్ది సుధాకర్(23), సుభాష్‌నగర్‌కు చెందిన దొబ్బల పవన్(24) ఈనెల 27న అర్ధరాత్రి సమయంలో ఒక ఆటోలో తిరుగుతూ కలెక్టరేట్ ఎదుట ఒక వ్యక్తిని అడ్డగించి, బెదిరించి అతని వద్ద నుంచి 3వేల రూపాయలు బలవంతంగా తీసుకుని పారిపోయారు. ఈ కేసులో నిందితుల కోసం గాలిస్తుండగా కరీంనగర్‌లో పట్టుబడ్డారని సీఐ తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనాలు, హాండ్ బ్యాగ్‌లు ఎత్తుకెళ్లినట్లు నిందితులు ఒప్పుకున్నారని తెలిపారు. నిందితులవద్ద నుంచి 1,700నగదు, ఆటోనుస్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

భూములు సాగు చేసిన వారిపై కేసు

చందుర్తి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు కింద ప్రధానకాలువ నిర్మాణంలో భూములు నష్టపోయి, పరిహారం పొంది, భూమిని అక్రమంగా సాగుచేస్తున్న వారిపై కేసునమోదు చేసినట్లు చందుర్తి ఎస్‌ఐ జె రమేష్ బుధవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మల్యాల గ్రామ శివారులో సర్వే నంబర్ 43, 53, 54, 84, 86ల లో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ప్రధాన కాలువ నిర్మాణంలో భూములు నష్టపోయి, పరిహారం పొందిన మల్యాల గ్రామానికి చెందిన మోత్కుపల్లి తిరుపతి, మోత్కుపల్లి గంగాధర్, దుర్గ కొమురయ్య, బుర్కా ఎల్లయ్య, పోతరాజు రాజేందర్ భూమిని అక్రమంగా సాగు చేస్తున్నారు. వారిని పలుమార్లు హెచ్చరించినా వినకుండా భూమిని సాగు చేస్తూ ప్రభుత్వానికి నష్టం కలిగించారని చందుర్తి తహసీల్దార్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తిరుపతి, గంగాధర్, కొమురయ్య, ఎల్లయ్యలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

సైదాపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన గొంగళ్ల శారద(36) అనే వివాహిత వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలం గుజ్జులపల్లి గ్రామానికి చెందిన శారదను 19సంవత్సరాల క్రితం అదే మండలం ఆరెపల్లి గ్రామానికిచెందిన గొంగళ్ల శ్రీనివాస్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా శారద కడుపునొప్పితో బాధ పడుతోంది. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా తగ్గలేదు. దీంతో ఈనెల21న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె భర్త శ్రీనివాస్ వచ్చి చూసే సరికి శారద అచేతన స్థితిలో పడి ఉంది. ఏమయిందని శ్రీనివాస్ అడుగగా కడుపునొప్పి భరించలేక గడ్డి మందు తాగానని, పిల్లలు జాగ్రత్త అని చెప్పింది. వెంటనే శ్రీని వాస్ శారదను హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడచికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం జమ్మికుంటలోని హాస్పటల్‌కు అక్కడినుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. వరంగల్‌లో చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందినట్లు వారు తెలిపారు. మృతురాలి తమ్ముడు గుంటి రవిందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సైదాపూర్ ఎస్సై తిరుపతి తెలిపారు.



కళాశాలలో ల్యాబ్



సిమ్స్ ముఖ ద్వారం

'సిమ్స్' సూపర్

- అత్యాధునిక సౌకర్యాలు
- అన్ని హంగులతో క్లాసు రూములు, హాస్టల్ భవనాలు...
- నాలుగో సంవత్సరంలో పీజీ సీట్ల మంజూరు...

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో అధునాతన సౌకర్యాలు ఉన్నాయి. 2022లో 150సీట్లతో ప్రారంభమైన మెడికల్ కళాశాలలో 15శాతం ఆల్ ఇండియా కోటా, 7శాతం సింగరేణి ఉద్యో గుల పిల్లలకు కేటాయిం చారు. అన్నీ వసతులు ఉండడంతో ఉత్తర, దక్షిణ ప్రాంతాలతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన విద్యార్థులు ఈ కళా శాలలో చేరడానికి ఆసక్తి చూపుతున్నారు. ఏసీ క్లాస్ రూమ్‌లు, అత్యాధునిక మెడికల్ ల్యాబ్‌లు, హాస్టల్ భవనాలు, ప్రొఫెసర్లు, సిబ్బందికి భవనాలు, ప్రిన్సిపాల్‌కు క్వార్టర్ కేటాయించారు. ప్రొఫెసర్లు అందుబాటులో కళాశాలలో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. 2022లో మొదటి బ్యాచ్ ప్రారంభం కాగా 2025-26 విద్యా సంవత్సరానికి ఇటీవల నేషనల్ మెడికల్ కౌన్సిల్ 4వ సంవత్సరానికి అనుమతి ఇవ్వడంతో రెండో కౌన్సెలింగ్‌లోనే 150సీట్లు నిండిపోయాయి. రాష్ట్రంలో 9 మెడికల్ కళాశాలలు కేటాయించగా 8 కళాశాలల్లో పనులు నత్తనడక నడుస్తున్నాయి. జగిత్యాల, మంచిర్యాలలో భవన నిర్మాణాలు పూర్తికాలేదు. గోదావరిఖనిలో సింగరేణి నిధులు కేటాయించడంతో పనులు పూర్తయ్యాయి. విద్యార్థులు కళాశాలలో చేరడానికి ఆసక్తి చూపుతున్నారు. మెడికల్ కళాశాలకు అనుబంధంగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 762 పడకల ఆసుపత్రిని అన్ని హంగులతో నిర్మిస్తున్నారు.

● పీజీ సీట్ల మంజూరు...

సిమ్స్ కళాశాలకు 16పీజీ సీట్లను మంజూరు చేసింది. ఎమర్జెన్సీ మెడిసిన్-4, ఎంఎస్ ఆర్థోపెడిక్-4, ఎండీ బయోకెమిస్ట్రీ-4, ఎంఎస్ గైనకాలజిస్ట్-4 సీట్లు మంజూరు చేసింది. 4వ సంవత్సరం పూర్తికాక ముందే ఇక్కడ పీజీ సీట్లు మంజూరు కావడంపై విద్యార్థులు, ప్రొఫెసర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మెడికల్ హబ్‌గా రామగుండం
- మక్కాన్‌సింగ్, ఎమ్మెల్యే



రామగుండాన్ని మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దమే లక్ష్యం. నూతన భవన నిర్మాణం కోసం రూ.142కోట్ల నిధులను మంజూరు చేయించా. మెడికల్ కళాశాలకు అనుబంధంగా రూ.20కోట్ల క్యాత్‌ల్యాబ్ నిర్మాణం, రూ.27కోట్లతో నర్సింగ్ కళాశాల, మరో 100సీట్ల డెంటల్ మెడికల్ కళాశాల అనుమతి ఫైల్ పెండింగ్‌లో ఉంది.

సౌకర్యాలు బాగున్నాయి...
- మధుల, మెడికల్ విద్యార్థిని, కేరళ



సిమ్స్ మెడికల్ కళాశాలలో సౌకర్యాలు బాగున్నాయి. క్లాస్ రూములు, హాస్టల్ భవనం, ఆసుపత్రిలో ప్రాక్టికల్స్, స్టడీ మెటీరియల్ బాగున్నాయి. కేరళ నుంచి వచ్చి ఇక్కడ చదువుకుంటున్నాను.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ
- సాయిప్రసన్న, మెడికల్ విద్యార్థి, మంచిర్యాల



సిమ్స్ మెడికల్ కళాశాల కొత్తది కావడంతో అన్ని సదుపాయాలు ఉన్నాయి. హాస్టల్ కూడా బాగుంది. ప్రొఫెసర్లు పాఠాలు అర్థమయ్యేలా బోధిస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. రోజు గంట యోగా, జిమ్ సదుపాయాలు కల్పించారు.

కళాశాలలో అధునాతన సౌకర్యాలు
- నరేందర్, ప్రిన్సిపాల్, సిమ్స్ మెడికల్ కళాశాల



సిమ్స్ మెడికల్ కళాశాల ప్రారంభమై నాలుగేళ్లు అవుతుంది. కళాశాల ప్రారంభం నుంచి ఇప్పటి వరకు వేగవంతంగా పనులు జరిగాయి. విద్యార్థులకు అన్నీ సౌకర్యాలు ఉన్నాయి. ప్రొఫెసర్లకు, సిబ్బందికి క్వార్టర్స్‌ను కేటాయించాం. ఈ ఏడాది పీజీ సీట్లు కూడా మంజూరయ్యాయి. త్వరలోనే కౌన్సెలింగ్ ద్వారా సీట్లు భర్తీ అవుతాయి.

నగల షాపులో చోరీ

జమ్మికుంట రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని కొండూర్ కాంప్లెక్స్‌లోగల ఎస్ఎల్ఎస్ జువెల్లరి షాపులో గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. షాపు షెటర్ ధ్వంసం చేసి అందులోని ఐదు గ్రాముల బంగారం ఎత్తుకెళ్లారు. అదేవిధంగా డిస్కౌంట్ స్టోర్ మొబైల్ షాపు షెటర్ ధ్వంసం చేసి దొంగతనానికి యత్నించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తుచేపట్టారు. వరుస దొంగతనాలతో జమ్మికుంట ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష

● ముగ్గురికి జరిమానా

కోల్‌సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రామగుండం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురికి జరిమానాతోపాటు ఒకరికి మూడు రోజుల జైలుశిక్షను గోదావరిఖని సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ వెంకటేష్ గురువ విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బీ రాజేశ్వర్‌రావు తెలిపారు. మెకానిక్‌గా పనిచేస్తున్న ఒక వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుతూ రెండోసారి పట్టుబడగా మూడు రోజల పాటు జైలు శిక్షవిధించి కరీంనగర్‌కు తరలించామని, మరో ముగ్గురికి రూ.6వేల జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

గన్నేరువరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్‌ద్వారా కనుగొని బాధితుడికి బుధవారం అందించినట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన ఆసరి పర్శరాములు తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నానని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్ దొరికిన వ్యక్తి సమాచారాన్ని కనుగొని బాధితుడికి అందించినట్లు తెలిపారు.

ఇసుక లారీ, కారు పట్టివేత

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీతో పాటు వాహన యజమాని ప్రయాణిస్తున్న కారును ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని సత్తేపీరీల దర్గా వద్ద కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై పట్టుకున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి బుధవారం తెలిపారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ మల్లేశం, యజమాని అస్లాం ఖురేషి, సహకరించిన వెంకటేశ్‌లను అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో సుల్తానాబాద్ మండలం నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను లారీలో రవాణా చేస్తూ పట్టుబడ్డారని చెప్పారు. లారీ యజమాని అస్లాం ఖురేషి, వెంకటేశ్‌లు కారులో ముందు ప్రయాణిస్తు లారీని పోలీసులు పట్టుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. లారీ, కారును పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చామని తెలిపారు. డ్రైవర్ మల్లేశం, యజమాని అస్లాంఖురేషి, వెంకటేశ్‌లను రిమాండ్‌కు తరలించామని వివరించారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రాహుల్‌రెడ్డి హెచ్చరించారు.

ఆన్‌లైన్ రమ్మీతో లక్షలు పోగొట్టుకున్నాడు

● అప్పులు తీర్చేందుకు దొంగతనాలు ● నిందితుడి అరెస్టు ● 12 లక్షల విలువైన బంగారం స్వాధీనం



నిందితుడిని అరెస్టు చూపుతున్న రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ రమ్మీ, బెట్టింగ్‌కు అలవాటుపడి లక్షల్లో నష్టపోయి అప్పుల్లో కూరుకుపోయాడు. ఆ అప్పు తీర్చేందుకు దొంగగా మారి చివరకు పోలీసులకు చిక్కి జైలుకు వెళ్లాడు. కరీంనగర్‌రూరల్ ఏసీపీ జి విజయ్ కుమార్ తెలిపినవివరాల ప్రకారం... కరీంనగర్ జిల్లా తీగలగుట్టపల్లిలోని రెవెన్యూకాలనీకి చెందిన మహమ్మద్ ముస్తాక్ సంవత్సరంన్నర నుంచి కోదాడ దగ్గరలోని మేళ్లచెరువు వద్ద బాయిలర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. అతను ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్, డాష్ రమ్మీకి అలవాటుపడి తన తల్లిదండ్రులకు తెలియకుండా తన స్నేహితులు, పరిచయస్థుల వద్ద అప్పు చేసి లక్షలు పోగొట్టుకున్నాడు. చేసిన అప్పులు తిరిగి చెల్లించే మార్గం కనపడకపోవడంతో దొంగగా మారాడు. ఇందుకోసం తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లిలోని ఒకే ఇంటిలో రెండుసార్లు చోరీకి పాల్పడ్డాడు. ఆ ఇంటి కిటికీ గ్రిల్‌ను తొలగించి ఇంట్లోకి చొరబడి బంగారం, నగదు దొంగిలించాడు. ఆ తరువాత జూబ్లీనగర్‌లోని దర్గా సమీపంలోని ఒక ఇంటో టీవీ దొంగలించాడు. దొంగిలించిన బంగారాన్ని కరీంనగర్‌లో ఎవరూ కొనుగోలు చేయకపోవడంతో కోదాడ వెళ్లి అక్కడ విక్రయించేందుకు ప్రయత్నించాడు. అక్కడ కూడా ఎవరూ కొనకపోవటంతో మహమ్మద్ ముస్తాక్ తిరిగి తీగలగుట్టపల్లికి వచ్చాడు. బుధవారం కరీంనగర్ రైల్వేస్టేషన్ వద్ద పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి, సిబ్బంది వెంటనే మహమ్మద్ ముస్తాక్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన దొంగతనాలు వెల్లడయ్యాయి. నిందితుడు మహమ్మద్ ముస్తాక్ వద్ద నుంచి 12 లక్షల రూపాయల విలువైన 91 గ్రాముల బంగారం, ఐదు వేల నగదు, ఒక సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్ తెలిపారు.

ఈ దొంగతనంలో కేసుల్లోని నేరస్తుడైన మహమ్మద్ ముస్తాక్‌ను పట్టుకున్న కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి, సీసీఎస్ సీఐ ప్రకాష్‌గౌడ్, ఎస్ఐ లక్ష్మారెడ్డి, సీసీఎస్ హెడ్‌కానిస్టేబుల్ ఎండి హసనోద్దీన్, కానిస్టేబుల్ ఎన్ శేఖర్, ఎండి ఖలీఫా, రూరల్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీరాములు, సల్మాన్‌లను పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, ఏసీపీ విజయ్ కుమార్ అభినందించారు. సిబ్బందికి నగదు రివార్డును అందజేశారు.

కరీంనగర్‌లో భారీ అగ్నిప్రమాదం

● రెండు షాపులు పూర్తిగా దగ్ధం ● రూ. 70 లక్షల ఆస్తి నష్టం



గణేశ్ ఎంటర్‌ప్రైజెస్ గోదాం పైఫ్లోర్ మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కరీంనగర్ క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని టవర్‌సర్కిల్ ప్రాంతంలో బుధవారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం జరిగింది. ఈ ప్రమాదంలో కపిల్ డ్రెస్సెస్‌తో పాటు గణేష్ ఎంటర్‌ప్రైజెస్ గోదాంలోని బట్టలు, ఎలక్ట్రానిక్ పరికరాలు పూర్తిగా కాలిపోయాయి. మొదట కపిల్ డ్రెస్సెస్‌లో పొగలు రావడాన్ని ఉదయం 6 గంటల ప్రాంతంలో స్థానికులు గుర్తించి డయల్ 100కు సమాచారం అందించారు. విషయం తెలియడంతో షాపు యజమాని సాయి సంఘటన స్థలానికి చేరుకుని షటర్ తీయగా అప్పటికే మంటలు వ్యాపించాయి. షాపులోని రెడీమేడ్, ఇతర బట్టలకు మంటలు అంటుకుని ఫర్నిచర్ పూర్తిగా దగ్ధమైంది. ఈ మంటలు పైఅంతస్థులోని గణేష్ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన గోదాంకు వ్యాపించాయి. ఈ సమయంలోనే కరీంనగర్ ఫైర్ సిబ్బంది రెండు ఫైరింజన్లతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే షాపులోని సామగ్రి మొత్తం కాలి బూడిదైంది. గోదాం షటర్ తెరిచేందుకు ఫైర్ సిబ్బంది గంటకుపైగా శ్రమించారు. తెరుచుకోలేక పోవడంతో జేసీబీని తీసుకవచ్చి బలవంతంగా షటర్‌ను, పక్క గోడను తొలగించారు. అనంతరం ఫైరింజన్‌తో మంట లను ఆర్పివేశారు. ఈలోగా గోదాంలోని కెమెరాలకు సంబంధించిన పరికరాలు, బ్యాగ్‌లు, ప్రింటర్లు, కంప్యూటర్ పరికరాలు కాలిపోయాయి. ఈ అగ్ని ప్రమాదంలో కపిల్ డ్రెస్సెస్‌కు 40లక్షల వరకు, గణేష్ ఎంటర్‌ప్రైజెస్‌కు 30లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిం దని బాధితులు సాయి, హరి చెప్పినట్లు జిల్లా అగ్ని మాపకశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కపిల్ డ్రెస్సెస్‌లో విద్యుత్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేశామని యజమాని సాయి తెలిపాడు. అగ్నిప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమా లేదా మరేమైనా కారణమా అనేది విచారణ జరుపుతున్నామని జిల్లా ఫైర్ ఆఫీసర్ తెలిపారు.

ఫైరింజన్ ఆలస్యంగా రావటంతో నష్టం ఎక్కువగా జరిగిందని బాధితులు ఆరోపించారు. కంట్రోల్‌రూం నుంచి ఫైర్ కాల్ రాగానే నిమిషాల వ్యవధిలో తాము సంఘటనా స్థలానికి చేరుకుని ఫైరింజన్‌లతో మంటలను ఆర్పివేశామని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి తెలిపారు. సంఘటనా స్థలాన్ని వన్‌టౌన్ సీఐ రాంచందర్‌రావు పరిశీలించారు.

● కరీంనగర్‌లో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంపై అగ్నిమాపక శాఖకు ఆలస్యంగా సమాచారం అందిందని జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అగ్నిప్రమాద ఘటనలు జరగగానే నేరుగా అగ్నిమాపక శాఖకు సంబంధిం చిన ఫోన్ నెంబర్లు టోల్‌ఫ్రీ 101, కరీంనగర్ ఫైర్ 2243399, 8712699140, 8712699141, 8712699143కి సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఘటనపై విచారణ జరపాలని వన్‌టౌన్ పోలీసులను కోరినట్లు తెలిపారు.

జగిత్యాల జిల్లా వాసిపై సౌదీలో కేసు



శ్రీనివాస్(ఫైల్)

జగిత్యాల టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలజిల్లా బుగ్గారం మండలం గోపులపూర్ గ్రామానికిచెందిన గాజుల శ్రీనివాస్‌పై సౌదీలో కేసునమోదు కాగా అక్కడే చిక్కుకుపోయాడు. శ్రీనివాస్‌కుఫైనల్ ఎగ్జిట్ (దేశం వదిలివెళ్లడానికి అనుమతి) లభించక సౌదీఅరేబియా రాజధాని రియాద్‌లో ఉండిపోయాడు. 12వేల సౌదీరియాళ్లు (రూ.2.8లక్షల భారత కరెన్సీ) దొంగతనం జరిగిందని యజమాని ఫిర్యాదుమేరకు శ్రీనివాస్‌పై మత్లూబ్ (వాంటెడ్ బై పోలీస్) కేసునమోదైంది. 2017లో ఆజాద్‌వీసాపై సౌదీవెళ్లిన గాజుల శ్రీనివాస్ ఎనిమిది ఏళ్లుగా అక్కడే ఉన్నారు. బీపీ, నరాల సమస్యలతో బాధపడుతున్న శ్రీనివాస్‌ను సౌదీ నుంచి ఇండియాకు రప్పించాలని ఆయన కుమారుడు గాజుల సాయికిరన్ హైదరాబాద్ సీఎం ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. భారత్‌కు రావడానికి అడ్డంకిగా ఉన్న మత్లూబ్ కేసు తొలగించేందుకు సహకరించాలని రియాద్‌లోని ఇండియన్ ఎంబసీకి ఇదివరకే రెండుసార్లు విజ్ఞప్తి చేసినట్లు ఆయన కుమారుడు తెలిపారు.

సౌదీలో గుండెపోటుతో వ్యక్తి మృతి



నర్సబోయి(ఫైల్)

ధర్మపురి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురికి చెందిన కొమిరెల్లి నర్సబోయి (50) గుండెపోటుతో మృతిచెందగా మృతదేహం బుధవారం స్వగ్రామం చేరుకుంది. జీవనోపాధి నిమిత్తం సౌదీ దేశానికి వెళ్లిన నర్సబోయి ఒక కంపెనీలో పని చేస్తున్నాడు. నెలరోజులక్రితం గుండెనొప్పితో మృతిచెందాడు. బుధవారం మృతదేహం ధర్మపురి చేరుకోగా కుటుంబసభ్యులు బోరున విలపించారు. మృతుడికి భార్యలక్ష్మి, కొడుకు సందీప్, కూతురులు సోని, సిమ్రాన్‌ఉన్నారు. బాధితకుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక గంగ పుత్ర సంఘం నాయకులు కోరుతున్నారు.

ఇసుక లారీ పట్టివేత

గంభీరావుపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం రాజేశ్వర్‌రావునగర్ కాలనీ వద్ద ఇసుకలారీని పట్టుకున్నట్టు ఏఎస్ఐ దేవేందర్‌రెడ్డి తెలిపారు. కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామానికి చెందిన తపాలా మల్లేశం అనే వ్యక్తి కరీంనగర్ నుంచి కామారెడ్డికి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా లారీలో ఇసుక తీసుకవస్తుండగా ఆర్ఆర్ నగర్ కాలనీ వద్ద పట్టుకున్నట్టు ఏఎస్ఐ వెల్లడించారు. టీఎస్ 02యూబి 7377నంబర్‌గల లారీలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకుని సీజ్‌చేశామన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న మల్లేశంపై కేసునమోదుచేసి, లారీనిస్టేషన్‌కు తరలించామ న్నారు.

ఇసుకను తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

చందుర్తి అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా, ఇసుకను తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు చందుర్తి ఎస్ఐ రమేష్ బుధవారం తెలిపారు. ఎస్సైకథనం ప్రకారం.. బుధవారం తెల్లవారుజామున పోలీసులపెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ముడపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పల్లెపు శ్రీకాంత్, ఓనర్ పల్లెపు వెంకటేష్‌ను పట్టుకొని విచారణ అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

ఎవరి పాత్ర ఎంత?

- కురిక్యాల పాఠశాల వద్ద పోలీసుల బందో బస్తు
- పాఠశాలను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ



పాఠశాల వద్ద పోలీసు బందోబస్తు

గంగాధర, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కురిక్యాల పాఠశాలలో జరిగిన ఘటనలో ఎవరి పాత్ర ఎంత ఉందనేది తల్లిదండ్రులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఈ ఘటన వెనక ఎవరెవరున్నారనేది అంతు చిక్కని ప్రశ్నగా మారింది. పాఠశాల సమయం నుంచి చివరి గంటవరకు పిల్లలు తరగతి గదుల్లోనే ఉపాధ్యాయుల పాఠాలు వింటుంటారు. ఇంతటి ఘటన జరుగుతున్న పాఠశాలలో బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నా.. ఎవరూ బయట పెట్టక ఎందుకు మౌనంగా ఉన్నారనేది అంతుచిక్కడం లేదు. అక్కడ పనిచేసే ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందిలో ఎవరో కొంత సహకారం ఉందని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు అనుమా నాలు వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ నివేదిక మేరకు నిందితుడు యాకూబ్ పాషాపై పోక్సో కేసు నమోదు చేసి సస్పెన్షన్ చేయగా ప్రధానో పాధ్యాయురాలిని సస్పెండ్ చేశారు. ఇక అసలు మూలాలను వెతక కుండా ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులందించి చేతులు దులుపుకున్నారని విద్యార్థిసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం త్రిసభ్యకమిటీ సేకరించిన విద్యార్థుల స్టేట్‌మెంట్ ఆధారంగా ఎవరెవరి పాత్రఉంది, ఎంతమందిపై కేసు చేయాల నేది తేట తెల్లమవుతుంది.

● విద్యార్థులకు మనోధైర్యం కల్పించాలి..

మానవత్వ విలువలు తెలియని వ్యక్తులు, బాలికలపట్ల అసభ్యకరంగా వ్యవహరించడం బాధాకరమైన విషయమని మాజీఎమ్మెల్యే బొడిగె శోభ అన్నారు. బుధవారం ఆమె కురిక్యాల పాఠశాలను సందర్శించి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనలో ప్రధానోపాధ్యాయురాలు సహకరిం చడం బాధాకరమైన విషయమ న్నారు. ధైర్యంగా చదువుకోవాలని పాఠశాల విద్యార్థులకు సూచిం చారు. కలెక్టర్ ఈఘటనలో జోక్యంచేసుకుని విద్యార్థుల తల్లిదండ్రు లతో సమావేశం నిర్వహించి వారికి మనోధైర్యం కల్పించాలని కోరారు.

● కురిక్యాల పాఠశాల వద్ద బుధవారం భారీగా పోలీసులను మోహరించారు. విద్యార్థి సంఘాలు, నాయకులు ఆందోళన చేస్తారన్న సమాచారం మేరకు ముందస్తుగా ఎస్సై వంశీకృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ప్రస్తుతం విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నందున ఎలాంటి ఆటంకం జరగకుండా పోలీసులను మోహరించినట్లు ఎస్సై తెలిపారు.

రైస్‌మిల్లులో పేలిన బాయిలర్

● ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు

సుల్తానాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్, కాట్నపల్లి గ్రామాల మధ్యన రాజీవ్‌రహదారి సమీపంలో కనకదుర్గ రైస్‌మిల్లులో బుధవారం ఉదయం బాయిలర్ పేలిపోయింది. భారీ శబ్దంతో పరిసరాలు దద్దరిల్లాయి. ఈ ఘటనలో అక్కడ పనిచేస్తున్న రామస్వామి, కుమార్ అనే ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని మిల్లు యాజమాన్యం వెంటనే చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. బాయిలర్ పేలుడు తీవ్రతకు పైకప్పులు లేచిపోయి, స్లాబ్‌లు, గోడలు, మిల్లులకు సంబంధించిన యంత్రాలు ధ్వంసమయ్యాయి. వీటి శకలాల కింద ఇద్దరు కార్మికులు పడి గాయపడ్డారు. మరోవైపు బాయిలర్‌లో ఉన్న బియ్యంతోపాటు గోదాంలో నిల్వఉన్న ధాన్యం సుమారురూ.2కోట్ల వరకు నష్టం సంభవించినట్లు మిల్లు యజమాని మోరపల్లి తిరుపతిరెడ్డి తెలిపారు. ప్రమాద సమాచారాన్ని అందుకున్న సీఐ సుబ్బారెడ్డితోపాటు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మిల్లు యజమానులతో కార్మికులతో మాట్లాడుతూ ప్రమాద కారణాలను తెలుసుకున్నారు. నాయకులు జైపాల్‌రెడ్డి, చీటి కేశవరావు, పురుషోత్తంరావు, హనుమంత రెడ్డి, మల్లారెడ్డి సదరు రైస్‌మిల్లుకు చేరుకొని ప్రమాదాన్ని పరిశీలించారు.

నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమా?

బాయిలర్ నిర్వహణలో నిర్లక్ష్యమే కారణమని తెలుస్తోంది. బాయిలర్ ఉష్ణోగ్రతను నమోదు గమనించాల్సి ఉంటుంది. ధాన్యాన్ని బాయిలర్‌లో పంపిన అనంతరం వేడి తీవ్రతను గమనిస్తూ ఆపరేట్ చేయాల్సి ఉంటుంది. స్టీమ్ రావడం కోసం వాల్వ్ బంద్ చేసిన ఆపరేటర్ బాయిలర్ వేడి తీవ్రతను గమనించకుండా ఉండటం వల్లనే ప్రమాదం జరిగినట్లు తెలుస్తుంది.

ఆర్చరీలో స్వర్ణం చేజిక్కించుకున్న చికిత



పతకాలతో చికిత

ఎలిగేడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన ఆర్చరీ క్రీడాకారిణి చికితకు ఆల్ ఇండియా యూనివర్సిటీ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో స్వర్ణపతకాన్ని దక్కించుకుంది. పంజాబ్‌లోని బటిండాలో ఈనెల 28నజరిగిన కాంపౌండ్ మిక్స్‌డ్ టీం ఫైనల్‌లో తానిపర్తి చికిత, ప్రథమేష్ జంట ట్రైకర్ విజయం సాధించిస్వర్ణం గెలుపొందారు. చికితను గ్రామస్తులు అభినందిం చారు.

బాలిక ఆత్మహత్య

కోరుట్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన బాలిక(17) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అదేకాలనీకి చెందిన మదినం నందీశ్వర్ అనేయువకుడు బాలికను ప్రేమించాలని ప్రతి రోజు వేధిస్తుం డేవాడు. దీంతో మనస్థాపం చెందిన బాలిక ఇంట్లో ఎవరూలేని సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గమనించిన బాలిక తల్లి చుట్టు ప్రక్కల వారికి తెలువగా వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు పరిశీలన జరిపి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తంప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలిక తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లుపోలీసులు తెలిపారు.

అభివృద్ధి పథంలో 'శాతవాహన'



- విద్యా బోధనలో సరికొత్త సంస్కరణలు
- 7న రెండో స్నాతకోత్సవం
- ముఖ్య అతిథిగా హాజరు కానున్న గవర్నర్ జి విష్ణుదేవ్ వర్మ

గణేశ్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శాతవాహన విశ్వవిద్యాలయం, బోధన, పరిశోధన, మౌలిక సదుపాయాల కల్పనలో అనేక కీలక సంస్కరణలను అమలు చేస్తూ అభివృద్ధి పథంలో నడుస్తోంది. ఉపకులపతి ఉమేష్‌కుమార్ ఆధ్వర్యంలో నవంబరు 7న విశ్వవిద్యాలయం రెండో స్నాతకోత్సవాన్ని నిరహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జి. విష్ణు దేవ్‌వర్మ హాజరయ్యే అవకాశం ఉంది. ఈ సంవత్సరం యూనివర్సిటీలో పలు మౌలిక సౌకర్యాలు కల్పించారు. పీఎం-ఉషా పథకం కింద బోధన, అభ్యాసంలో పలు మార్పులు తీసుకువచ్చారు. ప్రధాన క్యాంపస్‌లోని అన్ని తరగతి గదులను ఈ-బోర్డులతో ఆధునీకరించారు.



ఎగ్జామినేషన్ బ్రాంచ్ సెమినార్ హాల్

పరిశోధన, రెగ్యులర్ ప్రయోగశాలల కోసం 35 లక్షల విలువైన అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేశారు. మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయ అభివృద్ధికి 100 కోట్ల నిధులు మంజూరు చేసింది. హుస్నాబాద్‌లో ఇంజనీరింగ్ కళాశాల, యూనివర్సిటీ క్యాంపస్‌లో లా కళాశాలల నిర్మాణాల కోసం 66 కోట్లు, ఇతర అభివృద్ధి పనులకు 35 కోట్ల నిధులు విడుదలయ్యాయి. బాలికల హాస్టళ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

● మెగా జాబ్ మేళా

ఉపాధి అవకాశాలను పెంచే లక్ష్యంతో విశ్వవిద్యాలయంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి యూనివర్సిటీ క్యాంపస్, గోదావరిఖని పీజీ కాలేజీలో ఎంబీఏ కోర్సును పునఃప్రారంభించారు. ఎల్ఎండి క్యాంపస్‌లో ఎం ఫార్మసీ కోర్సును ప్రవేశపెట్టారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి హుస్నాబాద్‌లో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌ను ప్రారంభించారు.



ఎస్‌యూ పారిపాలన భవనం మొదటి అంతస్తును ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ (ఫైల్)

యూనివర్సిటీని ఉన్నత ప్రమాణాలకు చేర్చడమే లక్ష్యం.

-ప్రొఫెసర్ వి ఉమేష్ కుమార్, ఉప కులపతి



విశ్వవిద్యాలయాన్ని ఉన్నత ప్రమాణాలకు చేర్చడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. నాక్ అక్రిడిటేషన్ సాధించడంపై దృష్టి సారించాము. జాతీయ విద్యా విధానానికి (ఎన్ఈపీ) అనుగుణంగా విద్యార్థులకు ఉపాధి ఆధారిత కోర్సులను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. పాలనా సంస్కరణల్లో భాగంగా, క్యాంపస్‌లో పారదర్శకత, క్రమశిక్షణ కోసం బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేస్తున్నాము. రెండో స్నాతకోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నాము.



జర్మనీ టెంట్‌లో రాజన్న ప్రచార రథం..



రాజన్న ప్రచారరథం రక్షణ కోసం ఏర్పాటు చేసిన జర్మనీ టెంట్

వేములవాడ కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలోని ప్రచార రథానికి జర్మనీ టెంట్‌ను ఏర్పాటు చేశారు. రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణ పనుల్లో భాగంగా రాజన్న ఆలయం ముందు వేపచెట్టు వద్ద భక్తుల దర్శనాల కోసం ప్రచార రథాన్ని నిలిపారు. దీంతో వర్షానికి, ఎండకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఒక భారీ జర్మనీ టెంట్‌తో రక్షణ ఏర్పాటు చేశారు.

కొనసాగుతున్న కార్తీక దీపోత్సవం..

వేములవాడ కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంతో పాటుగా భీమన్న ఆలయంలో సామూహిక కార్తీక దీపోత్సవం కొనసాగుతుంది. కార్తీకమాసాన్ని పురస్కరించకుని భీమన్న ఆలయానికి చేరుకున్న భక్తులు పలు ఆకృతల్లో దీపాలను వెలిగించి పూలతో అలంకరించారు. ఆలయ ఉద్యోగులు భక్తులకు ప్రసాదాలను అందజేశారు.



వేములవాడ భీమన్న ఆలయంలో కార్తీక దీపోత్సవంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ముదిరాజ్‌ల రాజకీయ చైతన్యం కోసం కృషి చేయాలి

సుభాష్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌ల రాజకీయ చైతన్యం కోసం ముదిరాజ్ మహాసభ కృషి చేయాలని మాజీ మంత్రి, ఎంపీ ఈటెల రాజేందర్ సూచించారు. బుధవారం ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు గీకురు రవీందర్ తన కార్యవర్గంతో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఆయన శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ముదిరాజ్‌లు తమ తెగువ చూపారని అంతేకాకుండా రాష్ట్ర సామాజిక అభివృద్ధిలోనూ విశేషపాత్ర పోషించారని అన్నారు. రాష్ట్రంలో ముదిరాజ్‌లకు తగిన రాజకీయ ప్రాతినిత్యం లేకపోవడం బాధాకరమన్నారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో ముదిరాజ్ నాయకుల సమష్టిగా, సమన్వయంతో పనిచేస్తూ తెలంగాణ సమాజానికి ప్రాతినిధ్యం వహించాలని పిలుపునిచ్చారు. ఈటెల రాజేందర్‌ను కలిసిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి పండుగ నాగరాజు, గౌరవాధ్యక్షుడు కొలగాని నర్సయ్య, ఉపాధ్యక్షులు బండారి నరేందర్, భూమేష్, యువత అధ్యక్షుడు రెడ్డి సరేష్, కోశాధికారి గుంటుక శంకర్, కార్యదర్శి కుంభ మల్లయ్య, ముద్రవేణి కుమారస్వామి పాల్గొన్నారు.



ఈటెల రాజేందర్‌ను కలిసిన ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు గీకురు రవీందర్, కార్యవర్గం

దాడి చేసిన నిందితుడికి ఏడాది జైలు

జగిత్యాల టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వృద్ధుడిపై దాడి చేసి కులంపేరుతో దూషించిన కేసులో నిందితుడికి ఏడాది కఠిన కారాగార జైలు శిక్షతోపాటు రూ.500 జరిమానా విధిస్తూ కరీంనగర్ మూడో అదనపు సెషన్ కోర్టు అదనపు న్యాయమూర్తి నీరజ తీర్పు చెప్పారు. మేడిపల్లి మండలం కల్వకోట గ్రామానికి చెందిన గోడ వెంకటి అనే వృద్ధుడు గేదెలు మేపడానికి వెళ్ళిన క్రమంలో బస్టాండ్ వద్ద అదే గ్రామానికి చెందిన చందు అనేవ్యక్తి ద్విచక్రవాహనాన్ని వేగంగా నడిపి గేదెను ఢీకొట్టాడు. బైక్‌ను ఎందుకు వేగంగా నడిపావని చందును వెంకటి ప్రశ్నించాడు. నిందితుడు వృద్ధుడిని కులం పేరుతో దూషించి గోడకేసి కొట్టగా తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేయగా అప్పటి మెట్‌పల్లి డీఎస్పీ గౌస్‌బాబా దర్యాప్తు చేపట్టారు. కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏడాది జైలు శిక్ష రూ.500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడటంలో కృషి చేసిన ఇన్విస్టిగేషన్ ఆఫీసర్ గౌస్ బాబా, పిపి ఝాన్సీ, సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ ఉదయ్, సీఎంఎస్ కానిస్టేబుల్ సుమలతలను ఎస్పీ అభినందించారు.

రూ.7వేలు పలికిన పత్తి ధర

జమ్మికుంట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7వేలు పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 62మంది రైతులు 579క్వింటాళ్ల విడి పత్తి, 10మంది రైతులు 34క్వింటాళ్ల గోనెసంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాటద్వారా గరిష్ఠ ధర రూ.7వేలు, కనిష్ఠధర రూ.6వేలు చెల్లించి పత్తికొనుగోళ్లు చేపట్టారు.

కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ముగ్గురు రైతులనుంచి 65క్వింటాళ్ల పత్తిని ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోళ్లు చేపట్టింది. మార్కెట్ కార్యదర్శి ఆర్ మల్లేశం పత్తి కొనుగోళ్లను దగ్గరుండి పర్యవేక్షించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



రాకేష్(ఫైల్)

ముత్తారం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మచ్చుపేటకు చెందిన రాయినేని గట్టయ్య లక్ష్మిల కుమారుడు రాయినేని రాకేష్(25) చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈనెల 28న గడ్డిమందు తాగగా గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు.

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి



వెంకటేశ్వరరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దారం శ్రీనివాస్

సుభాష్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని ఆడిట్‌శాఖ రాష్ట్రసంచాలకుడు మార్తవేని వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం జిల్లాపర్యటనకు వచ్చిన ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఆన్‌లైన్ ఆడిట్ ద్వారా రాష్ట్రాన్ని దేశానికే దిక్సూచిగా నిలిపిన అధికారి మార్తవేని వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన అందరికీ ఆదర్శప్రాయుడని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ పోరిక రాము, జిల్లా స్టేట్ ఆడిట్ డిప్యూటీ డైరెక్టర్ రాజ్‌కుమార్, మున్సిపల్ కార్పొరేషన్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ రంజిత చికిలే, డిప్యూటీ డైరెక్టర్ వేణు మాధవరెడ్డి, సుచేత, బోయల్ త్రినాథ్, దత్తు, ఆడిట్ ఉద్యోగులు, టీఎన్‌జీవో నాయకులు పాల్గొన్నారు.

బాబ్లీ గేట్ల మూసివేత

జగిత్యాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువన మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను త్రిసభ్యకమిటీ పర్యవేక్షణలో బుధవారం మూసివేశారు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పుప్రకారం ప్రతీయేటా జూలై 1న బాబ్లీ ప్రాజెక్టు గేట్లను తెరిచి అక్టోబరు 29న మూసివేస్తారు. దీనిప్రకారం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారులు, నాందేడ్ ఇరిగేషన్ అధికారులు, సీడబ్ల్యూసీ అధికారుల బృందంతో కూడిన త్రిసభ్యకమిటీ సమక్షంలో బాబ్లీగేట్లను మూసివేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఎస్‌పీ ఎస్ఈ జగదీశ్, సీడబ్ల్యూసీ ఈఈ ఫ్రాంక్లిన్, నాందేడ్ ఈఈ సీఆర్ బాన్‌సోడ్, ఎస్ఆర్ఎస్‌పీ పోచంపాడ్ ఏఈఈ కొత్త రవి, సీడబ్ల్యూసీ ఎస్‌డీఈ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా బాబ్లీప్రాజెక్టు ఎగువన వర్షం కురుస్తుండడంతో వస్తున్న వరద నీరు వల్ల కొన్నిగేట్లు వరద ప్రవాహం ఉన్నంతవరకు తెరిచి ఉంచబడుతాయని అధికారులు ప్రకటించారు.

శ్రీరాంసాగర్‌కు పెరిగిన వరద

జగిత్యాల: శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరదనీరు రావడం బుధవారం పెరిగింది. ఎగువప్రాంతం నుంచి 59,654క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 16వరద గేట్లు ఎత్తి దిగువ గోదావరిలోకి 50వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 80.501టీఎంసీల నీరునిల్వ ఉంది. కాకతీయకాలువ, సరస్వతీ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 59,654 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో ఎస్కేప్ గేట్ల ద్వారా 8వేల క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతోంది.

మిడ్ మానేరుకు భారీగా ఇన్‌ఫ్లో..

బోయినపల్లి: మొంథా తుఫాన్ ప్రభావం వల్ల బుధవారం కురిసిన వర్షానికి శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి(మిడ్‌మానేరు) బుధవారం 14 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు ఎగువ భాగాన కురిసిన వర్షంతో మానేరు, మూలవాగు, వరదకాలువ ఇన్‌లెట్స్ ద్వారా వరద నీరువచ్చి చేరుతోంది. అయితే ప్రాజెక్టుపూర్తిస్థాయిలో నిండడంతో దిగువకు 13175వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318మీటర్లకు ప్రస్తుతం 317.79 సామర్థ్యం 27.55టీఎంసీలకు 27.042టీఎంసీల మేరకు నిల్వ ఉంది.

కేంద్రం, రాష్ట్రాల సమన్వయంతోనే అభివృద్ధి

- ఇకపై కలెక్టర్లు క్షేత్రస్థాయిలో తనిఖీచేసి శాఖలవారీగా చర్యలు తీసుకోవాలి
- కేంద్ర పథకాలపై ప్రతినెలా ప్రగతి నివేదిక మీడియాకు ఇవ్వండి
- పెద్ద ఎత్తున నిధులు ఇస్తున్నా.. ప్రజలకు తెలుపకపోతే ఎలా?
- కరీంనగర్‌లో యూజీడీ పేరుతో నిధులన్నీ నాశనం చేశారు
- కష్టపడి నిధులు తెచ్చా... కార్పొరేషన్‌లో ఎంపీ ల్యాడ్ గ్రౌండింగ్‌లో జాప్యమెందుకు?
- మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం సహించరానిది
- అమృత్ పూర్తి బాధ్యత కమిషనర్ దే
- 'దిశ' సమీక్షలో అధికారులపై కేంద్రమంత్రి హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆగ్రహం



మాట్లాడుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్

కరీంనగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'కేంద్రం నుంచి రాష్ట్రంలోనే అత్యధికంగా కరీంనగర్ పార్లమెంట్‌కు నిధులు తెస్తున్నా.. కేంద్రం, రాష్ట్రం సమన్వయంతో, సహకారంతో పనిచేస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుంది. కేంద్రం పెద్ద ఎత్తున నిధులు ఇస్తున్నా ప్రజలకు తెలియజేయకపోతే ఎలా..., కలెక్టర్లు క్షేత్రస్థాయిలో తనిఖీచేసి శాఖలవారిగా చర్యలు తీసుకోవాలి.. కేంద్ర పథకాలపై ప్రతినెలా ప్రోగెస్ రిపోర్టును మీడియాకు రిలీజ్‌చేయాలి' అని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి, జిల్లాఅభివృద్ధి కో ఆర్డినేటషన్ అండ్‌మానిటరింగ్ కమిటీ(దిశ) చైర్మన్ బండి సంజయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అభివృద్ధి, కోఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(దిశ) సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా సంజయ్‌కుమార్ మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి అనేక నిధులు మంజూరు చేయించి పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామన్నారు. ఏ పార్టీకి చెందినవారైనా నియోజకవర్గ అభివృద్ధికి, సలహాలు, సూచనలు ఇవ్వవచ్చని తెలిపారు. కేంద్రప్రభుత్వ నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధిపనులు జరుగుతున్నాయన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

కరీంనగర్ అభివృద్ధికి రూ. 851 కోట్ల నిధులు

ఇప్పటి వరకు 851కోట్ల రూపాయల ఎంపీ నిధులను కరీంనగర్ అభివృద్ధికి కేటాయించామని బండి సంజయ్ తెలిపారు. కరీంనగర్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీని (యుజీడీ) అట్టర్‌ప్లాఫ్ చేశారని, గుంతలు తవ్వి వదిలివేశారని, నిధులన్ని సర్వనాశనం చేశారని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కష్టపడి నిధులు తీసుకువస్తే ఎంపీ ల్యాడ్ గ్రౌండ్ కావడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమృత్ స్కీమ్ పూర్తి పర్యవేక్షణ, బాధ్యత మీదేనని కమిషనర్‌కు సూచించారు. నగరపాలక సంస్థ అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. గ్యాస్ కనెక్షన్లు ఇచ్చాక కట్టెల పొయ్యిపై ప్రజలు ఎందుకు వండుతున్నారని, వీటిపై ప్రజలకు ఎందుకు అవగాహన కల్పించడం లేదని ప్రశ్నించారు. జిల్లాలో ఆర్అండ్‌బీ పనులు నత్తనడకన నడుస్తున్నాయని, అధికారులు ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంట్రాక్టర్లు సిండికేటై ప్రజలను ఇబ్బంది పెడుతుంటే ఏమి చేస్తున్నారని నిలదీశారు.

తీగలగుట్టపల్లి ఆర్వోబీ పనులు ఇంకెన్నాళ్లు?

తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఎప్పటికి పూర్తి చేస్తారని, ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నా మీకు పట్టింపు లేదా అని అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గన్నేరువరం నుంచి బెజ్జంకి రోడ్డు పనుల్లో నిర్లక్ష్యం ఎందుకు నిర్లక్ష్యం చూపుతున్నారని, నిరంతరం అధికారులు క్షేత్రస్థాయిలో ఎందుకు తనిఖీలు చేయడం లేదని ప్రశ్నించారు. బ్యాంకుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా విశ్వకర్మ, పీఎంఈజీపీ రుణాలెందుకు ఇవ్వడం లేదని అడిగారు. తనఖా లేకుండా రూ.25లక్షల్లోపు రుణాలు ఇవ్వాలని నిబంధనలు ఉన్నా ఎందుకు పట్టించుకోరని బ్యాంకర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లీడ్‌బ్యాంకు మేనేజర్ వెంటనే బ్యాంకర్లతో మాట్లాడి రుణాలిప్పించాలని సూచించారు. దీనిపై కలెక్టర్లు సంబంధిత శాఖల అధి కారులతో సమావేశం నిర్వహించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాట వినని బ్యాంకుల వద్దనున్న డిపాజిట్లను వెనక్కి తీసుకోవాలని సూచించారు. తాను కిందిస్థాయినుంచి ఎదిగిన వ్యక్తినని, ఎప్పుడు రూల్స్‌కు వ్యతిరేకంగా పనిచేయాలని చెప్పనని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారంపై తమ ఆఫీసునుంచి లేఖ పంపితే కొందరు రిప్లయి కూడా ఇవ్వడం లేదని, ఇకపై అలాచేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశంతో హుజూరాబాద్, హుస్నాబాద్, జమ్మికుంట, సిరిసిల్ల ఆసుపత్రులకు అవసరమైన పరికరాలు ఏర్పాటు చేయిస్తున్నామని, అందుకు తగిన సిబ్బందిని, వైద్యులను నియమించాలన్నారు. గతంలో లక్షలాది రూపాయలతో అంబులెన్సులను ఆసుపత్రులకు ఇస్తే వాటిని మూలనపడేశారని, దీంతో ఆటోల్లో మృతదేహా లను తీసుకెళ్తారని, తాను నిధులు తెచ్చి ఏమి ప్రయోజనమని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 15వేలసైకిళ్లను ఉచితంగా అందజేశామని, మరో ఐదువేల సైకిళ్లను ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈకార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపవుట్స్ తగ్గాయని మంత్రి తెలిపారు.

కేంద్ర నిధులు మళ్లిస్తే కఠిన చర్యలు

పీఎంశ్రీ నిధులను ఇతర కార్యక్రమాలకు మళ్లించినట్లు తెలిసిందని, కేంద్రం నిధులను మళ్లిస్తే కఠిన చర్యలు ఉంటాయని అధికారులను కేంద్రహోం శాఖ సహాయమంత్రి బండిసంజయ్ హెచ్చరించారు. ప్రభుత్వపాఠశాలల్లో మరుగుదొడ్లు, మౌలిక సదుపాయాలు అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎంపీ నిధుల ద్వారా మంజూరైన పనులన్నింటిని యుద్ద ప్రాతిపదికన పూర్తిచేయాలని ఆదేశించారు. గన్నేరువరం బ్రిడ్జి కోసం సేతు బంధన్ పథకం ద్వారా 77కోట్ల రూపాయలను మంజూరు చేయించానని, ఆ పనులను వేగంగా పూర్తిచేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని మందులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రానున్న నాలుగుసంవత్సరాల కాలానికి సరిపడామందుల ఇండెంట్ తనకు సమర్పించాలని, నిధులు సమకూరుస్తానని కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు.

ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు త్వరగా పూర్తి చేయాలి

ఆయుష్మాన్ భారత్‌రిజిస్ట్రేషన్లను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లోని అంగన్‌వాడీ టీచర్లకు రోజువారీ నివేదిక సమర్పించేందుకు ఉచితంగాట్యాబ్ అందజేస్తామని సంజయ్ తెలిపారు. సోలార్‌పవర్ వినియోగం పెంచేందుకు కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు.

● పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య మాట్లాడుతూ పాఠశాలల్లో మరుగుదొడ్లు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. తన క్షేత్రస్థాయి పర్యటనలో అనేక పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేవని అసంతృప్తిని వ్యక్తం చేశారు. కస్తూర్బా పాఠశాలల్లో సిబ్బంది వేతనాలను పెంచాలని, మోడల్ స్కూల్ సిబ్బందికి ప్రతినెలా క్రమం తప్పకుండా వేతనాలు ఇవ్వాలని సూచించారు. బడిమానేసిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించి వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

● కేంద్ర పథకాలపై అవగాహన కల్పించాలి

- ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి

పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. విద్యవైద్యం తదితర రంగాల్లో కేంద్రం అనేక నిధులు వెచ్చించి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. ప్రజలు ఈపథకాలను సద్వినియోగం చేసుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారుల్లో ఉందని అన్నారు. సమావేశంలో కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి, సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాఖడే, లక్ష్మీకిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పాల్గొన్నారు.

ముంచిన మొంథా తుఫాను





కోరుట్ల మండలం చిన్నమెట్‌పల్లి గ్రామంలో నేలకొరిగిన వరి, కొడిమ్యాల మండలంలో నేల వాలిన వరి, జగిత్యాల మార్కెట్‌లో తడిసిన ధాన్యం

(ఐదో పేజీ తరువాయి)

జగిత్యాల అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో బుధవారం జిల్లా కేంద్రంలో భారీ వర్షం కురిసింది. వర్షానికి ప్రధాన రహదారులన్నీ జలమయం అయ్యాయి. వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చిన ఎక్కడి వారక్కడే నిలిచిపోయారు. భారీ వర్షానికి జగిత్యాల పట్టణంలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసిపోయింది. దీంతో రైతులు ధాన్యాన్ని వర్షం నుంచి కాపాడుకోవడానికి కవర్లు కప్పారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

●**కోరుట్ల/కోరుట్ల రూరల్:** కోరుట్ల పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం భారీ వర్షం కురవడంతో కోతకు వచ్చిన వరి పంట నేలకొరిగింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిలువ ఉన్న ధాన్యం కొంత మేర తడవడంతో కవర్లను కప్పి రైతు కాపాడుకునే ప్రయత్నం చేశారు. పట్టణంలోని కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. రోడ్లపై వర్షం నీరు ప్రవహించడంతో వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగగా విద్యుత్ అధికారులు మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారు.

నేలవాలిన వరి

●**కొడిమ్యాల:** మండలంలోని పలు గ్రామాల్లో తుఫాన్ ప్రభావంతో వర్షం కురిసంది. దాంతో పలు గ్రామాల్లో వరి పంట నేలవాలింది. కొంత సేపు కురవటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలో సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 11వరిధాన్యం కొనుగోలు కేంద్రాలకు, కొడిమ్యాల, పూడూర్, తిర్మాలాపూర్ సింగిల్ విండోల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలకు వరిధాన్యాన్ని రైతులు తరలించారు. వాతావరణ పరిస్థితులు సరిగా లేనందున సంబందిత అధికారులు తూకం వేయటం ప్రారంభించలేదు. కురుస్తున్న ముసురు వర్షాలకు కొనుగోలు కేంద్రాల వద్ద తమ ధాన్యం తడిసి పోతుందని వివిద గ్రామాల రైతుల ఆందోళన చెందుతున్నారు. వర్షం ఎప్పుడు కురుస్తుందో తెలియని రైతులు ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలకు తరలించిన వరిధాన్యం తడవకుండా ధాన్యంపై కవర్లను కప్పుకున్నారు.

రైతుల్లో గుబులు

●**మెట్‌పల్లి రూరల్:** మొంథా తుఫాన్ రైతుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. మెట్‌పల్లి మండలం మేడిపల్లిలో వరి పంట నేలవాలింది. మొంథా తుఫాన్ ప్రభావంతో గురువారం వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక అన్నదాతను ఆందోళనకు గురిచేస్తోంది. మండలంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న చిరుజల్లులతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు తగ్గి ఎండ కొడితే తప్ప తేమ శాతం రాలేని పరిస్థితి అని రైతులు వాపోతున్నారు. తడిసిన ధాన్యం పేరుతో కోతలు విధించకుండా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

తడిసిన ధాన్యం

●**మల్యాల:** మండలంలో బుధవారం మధ్యాహ్నం నుంచి ఎడితెరపి లేకుండా కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన వరి ధాన్యం తడిచిపోయింది. రైతులు ధాన్యంపై కవర్లు కప్పినప్పటికీ వాటి నుంచి వర్షపు నీరు ప్రవహించడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి తూకం వేయకపోవడంతో ధాన్యం తడిచిపోతుందని అంటున్నారు. ధాన్యం కాపాడుకోవడం ప్రహసనంగా మారిందని ఆవేదన చెందుతున్నారు.

తడిసిన మొక్కజొన్న

●**గొల్లపల్లి:** మండలంలో కురిసిన వర్షానికి చేతికందిన వరి పంట నేలపాలయింది. వర్షంతో కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యం తడిసిపోయింది. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలలో అమ్మకానికి ఉన్న మొక్కజొన్న వర్షానికి తడిసింది. చేతికి అందిన పంట వర్షం పాలు కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చెందుతున్నారు.



కొండగట్టులో విద్యుత్ తీగలపై పడిన తాటి చెట్టు

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై సుధీర్‌రావు

రాయికల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రాయికల్ ఎస్సై సుధీర్‌రావు అన్నారు. మండలంలోని ఇటిక్యాల మోడల్ స్కూల్‌లో బుధవారం పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు సైబర్ నేరాలు, డ్రగ్స్ నిర్మూలన, ట్రాఫిక్ నియమాలు, మూఢ నమ్మకాలు, ఆధునిక చట్టాలపై పోలీస్ కళా బృందంచే పాటలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొల్లూరి సంతోష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మల్యాల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నరేశ్‌కుమార్ సూచించారు. చెరువులు, కాలువలు పొంగే అవకాశం ఉన్నందున దాటే ప్రయత్నాలు చేయవద్దని, అత్యవసం అయితేనే బయటకు రావాలని అన్నారు. రోడ్లపై వెళ్లేప్పుడు గుంతలు గమనిస్తూ జాగ్రత్తగా వెళ్లాలని ప్రజల రక్ష ణే మా భాధ్యత అని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే గ్రామాల్లోనూ పంచాయితీ అధికారులు ప్రజలను, రైతులను అప్రమత్తం చేస్తున్నారు.

'ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ అందరి బాధ్యత'

జగిత్యాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. బాధ్యత గల పౌరుడిగా పట్టణంలో వందకోట్ల భూ ఆక్రమణను వెలుగులోకి తీసుకువచ్చానని, నేనెప్పుడు ప్రజల పక్షమేనని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కిబాల ద్వారా భూమిని పొందినట్లయితే 1964లో బాల వీరేశం కమిటీకి కిబాల ఎందుకు చూపించలేదో తెలపాలని, భూమి పొందిన దారం వీరేశం మరణానంతరం 1975 తర్వాత కిబాలను తెరపైకి తీసుకువచ్చారన్నారు. దీంతో అది సృష్టించ బడినట్లు భావించవలసి వస్తుందని అన్నారు. వంద కోట్ల ప్రభుత్వ భూమిని కబ్జా దారులనుంచి కాపాడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపై కూడా ఉన్నదని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు జీవన్‌రెడ్డి సమాధానం ఇచ్చారు. స్థలాన్ని మున్సిపల్‌కు అందజేయని పక్షంలో ప్రజలతో కలిసి జెండాలు పాతేందుకు కూడా తాను సిద్ధమని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగెస్ అధ్యక్షులు గాజంగి నందయ్య, జిల్లా మహి ళా కాంగ్రెస్ అధ్యక్షులు తాటిపత్రి విజయలక్ష్మీ, దేవేందర్ రెడ్డి, టిపిసిసి కార్యదర్శి బండ శంకర్, మాజీ కౌన్సిలర్‌లు కొంద్ర జగన్, గాజుల రాజెందర్, కండ్లపెల్లి దుర్గయ్య, నక్క జీవన్, మన్సూర్, నాయకులు బీరం రాజేష్, ఎన్నారై సెల్ అధ్యక్షులు చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

భీమారం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలంలోని రాజలింగంపేట గ్రామంలో బుధవారం బావాబామ్మర్దుల ఆత్మీయ సమ్మేళన వేడుకలు ఘనంగా జరిగాయి. కరీంనగర్‌కు చెందిన వ్యాపారవేత్త కస్తూరి నాగరాజు కులాలకతీతంగా వరుసకు బావ బామ్మర్దులైన వారందరినీ ఒకే చోట చేర్చి సన్మానం చేసి విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గజం శంకర్, కోరెపు మల్లేష్, బండారి శేఖర్, క్యాతం సత్తిరెడ్డి, గంధ్ర సురేందర్ రావు, చిలివేరి భూమయ్య, అంబటి భూమయ్య, రమేష్, వోలవేని తిరుపతి, నేరెళ్ల మహేష్ గౌడ్, రాజు, నారాయణ, సత్తయ్య, గంగారాం, రవి, బండపెల్లి సంజీవ్, రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

రాయికల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మహిళా పట్టణ సమాఖ్యకు చందిన శ్రీ విఘ్నేశ్వర స్లామ్ సమాఖ్యలోని శ్రీ విద్య శక్త సంఘానికి చెందిన కొత్తపెల్లి గంగు ఇటీవల మరణించింది. ఆమె స్త్రీనిధి ద్వారా రూ.లక్ష లోన్ తీసుకుని కొంత రికవరీ డబ్బులు చెల్లించింది. అయితే సభ్యురాలికి సంబంధించి రూ.84,644ల అప్పు నిల్వ క్లియర్ చేసుకుని ఇన్సూరెన్స్ డబ్బులు రూ.12,600 సభ్యురాలు గంగు కోడలుకు బుధవారం మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా టీఎంసీ శరణ్య, ఆర్పీ జ్యోత్స్న, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కాలువల నిర్మాణానికి నిధులు కేటాయించడం హర్షణీయం

కథలాపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలికోట సూరమ్మ చెరువు కుడి, ఎడమ కాల్వల నిర్మాణంకు నిధులు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడం హర్షనీయమని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి రాదాకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక విలేకర్ల సమావేశంలో స్థానిక నాయకులతోకలిసి రాదాకృష్ణ మాట్లాడారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ ప్రత్యేక శ్రద్ధ చూపి సూరమ్మ చెరువు అభివృద్ధికి రూ. 35 కోట్లు విడుదల కవడంతో పాటు కాల్వ నిర్మాణంను కృషి చేయ్యడం హర్షనీయమని అన్నారు. నిదులు మంజూరికి కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు'



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్

భీమారం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్ అన్నారు. మండలంలోని కాచారం, ఒడ్యాడ్, గోవిందారం గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాతిగా నిలుస్తుం దని పేర్కొన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్విని యోగం చేసుకుని మద్ధతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మునీందర్, ఏవో అలీ, నాయకులు పాల్గొన్నారు.

●రాయికల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామారావుపల్లె, ఇటిక్యాల గ్రామాల్లో బుధవారం సెర్ప్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం పోతు నరహరి, ఆర్ఐ పద్మయ్య, సీసీలు గంగారాం, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

●కథలాపూర్ : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటి చైర్మెన్ నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పెగ్గెర్ల, చింతకుంట, భూషణ్‌రావుపేట, ఊటుపల్లి, రాజారాం తండాలలో వరి దాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మెన్ పులి శిరీష-హరిప్రసాద్, డైరెక్టర్లు వాకిటి రాజారెడ్డి, కరుపు గంగాధర్, ఎపిఎం చిన్న రాజయ్య, సీఈఓ ఆరుణ్, స్వామి రెడ్డి, సీఈఓ ఆరుణ, స్వామి రెడ్డి, చిన్నారెడ్డి, లవకుమార్ పాల్గొన్నారు.

●మల్యాల: మండలంలోని పోతారం సింగిల్‌విండో ఆధ్వర్యంలో రాజారం, పోతారం, గొల్లపల్లి, రాంపూర్‌లో ఏర్పాటు చేసిన వరి దాన్యం కొనుగోలు కేంద్రాలను మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ బత్తిని మల్లీశ్వరీశ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వసంత, ఆర్ఐ తిరుపతి, ఏఈవో మంజుల, వెల్మ లక్ష్మారెడ్డి, మ్యాక లక్ష్మన్, ఎడిపల్లి రాజిరెడ్డి, గంగాధర్, తిరుపతిరెడ్డి, గుర్రం శ్రీకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది కలగకుండా మౌలిక వసతులు ఏరాంటు చేయాలనీ తహసీల్దార్ వరప్రసాద్ సూచించారు. మండలంలోని తిమ్మాపూర్ సహకార సంఘం పరిధిలోని గోధుర్ వరి కొనుగోలు కేంద్రం స్థలాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కనీస సౌకర్యాలు ఏరాంటు చేయాలనీ, విద్యుత్ సౌకర్యం ఏరాంటు చేసి,వర్షం వస్తే రైతులకు ఇబ్బంది కలగకుండా చిన్న షెడ్డులాంటి నిర్మాణం చేపట్టాలని సూచించారు.

ఈకార్యక్రమంలో ఆర్ఐ రమేష్, ఫారెస్ట్ బీట్ అధికారి మధు, తిమ్మాపూర్ సహకార సంఘం సి ఈ ఓ సంపత్, కిషోర్, హరీష్ తదితరులు ఉన్నారు.

మొక్కుబడిగా మొక్కజొన్న కొనుగోళ్లు

-తేమ సాకుతో తీవ్ర జాప్యం
-వర్షాలతో ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పండించిన మొక్కజొన్న పంటను మార్కెట్‌లో అమ్ముకునేందుకు రైతులు అగచాట్లు పడుతున్నారు. మొక్కజొన్న పంట చేతికి వచ్చిన నాటి నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించారు. ఆలస్యంగానైనా ప్రభుత్వం స్పందించి ప్రభుత్వం కొనుగోలు సెంటర్‌లను మద్దతు ధర కల్పిస్తూ ప్రారంభించిందని ఆనందంతో ఉన్న రైతులకు నిరాశే ఎదురైంది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి వారం రోజులు గడిచిన మొక్కుబడిగా కొనుగోల్లు జరపకపోడంతో అన్నదాతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 32,800 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేయగా 15.83లక్షల టన్నుల పంట దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు.

కొనుగోళ్లకు నిబంధనల అడ్డంకి

మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రూ.2400 మద్దతు ధరను ప్రకటించిందనే సంతోషం వ్యక్తం చేశారు. కానీ పంటను కొనుగోలు చేసుకోవాలంటే ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు అయి ఉండా లని ప్రభుత్వం పేర్కొనడంతో వివరాలు నమోదు కాని రైతులు అవస్థలు పడుతున్నారు. రైతు నుంచి కేవలం 18.50క్వింటాళ్ల ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రకటించడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. 14శాతం తేమ సాకు రైతులకు మరింత ఇబ్బందికరంగా మారింది.

వర్షాలతో రైతుల ఆందోళన

జిల్లాపై తుఫాన్ ప్రభావం ఉండడంతో మూలిగే నక్కపై తాటిపండు అన్నచందాన తయారైంది మొక్కజొన్న రైతుల దుస్థితి. ధాన్యం కాపాడుకునేందుకు కనీసం టార్పాలిన్ కవర్లు అందుబాటులో లేకపోవడంతో రైతులు పంటను కాపాడుకునేందుకు అపసోపాలు పడుతున్నారు. జిల్లాలో 15.83లక్షల టన్నుల పంటల దిగుబడికి గానూ. జిల్లాలో వారం రోజుల కింద కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన కూడా నేటికీ కేవలం 7500 క్వింటాళ్ల ధాన్యం మాత్రమే కొనుగోలు చేయగలగడం చూస్తే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల దుస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. తుఫాన్ మరింత బలపడితే కొనుగోళ్ల మరింత జాప్యం అయ్యే పరిస్థితి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రూ.2400 మద్దతు ధర ఉన్నా కూడా జిల్లాలో సగానికి పైగా రైతులు ఇప్పటికే ధాన్యాన్ని రైతులకు విక్రయించినట్టు సమాచారం. జిల్లాలోని కథలాపూర్, మల్లాపూర్, మెట్‌పల్లి, కోరుట్ల, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాల్లో కేంద్రాలు తెరవడం ఆలస్యమవడంతో కేవలం రూ.1600-రూ.1800కే మొక్కజొన్న ను దళారులకు అమ్ముకున్నారు.



కొనుగోలు కేంద్రంలో మక్కలను ఆరబెడుతున్న రైతులు

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

జైపాల్ రెడ్డి, రైతు, మోరపల్లి గ్రామం



జగిత్యాల మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి మక్కలను తీసుకువచ్చినం. 20క్వింటాళ్ల ధాన్యం తెచ్చిన కూడా కొనేందుకు వారం రోజులు పట్టింది. తేమశాతం నిబంధన మా రైతు లకు ఇబ్బందిగా మారింది. మొక్కజొన్న కొనుగోళ్ల వేగవంతం చేయాలి.

రైతులను గోస పెట్టొద్దు

దావ వసంత, జడ్పీ మాజీ చైర్‌పర్సన్



ఆరుగాలం శ్రమించిన పంటను అమ్ముకోలేని దుస్థితిలో రైతులు ఉండడం విచారకరం. పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు కొనుగోలు కేంద్రాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనలతో రైతులను, రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తుంది. రైతులను అరిగోస పెట్టకుండా ధాన్యం సేకరించాలి. తడిసిన ధాన్యాన్ని సైతం మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

గోమాతకు పూజలు

ధర్మపురి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని బాదినేని జగదీష్ గోశాల వద్ద విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం గోపాష్టమి వేడుకలు, గోపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి కస్తూరి రాజన్న గోవులను పూజించారు. అనంతరం సభ్యులందరికి సకల దేవతల కరుణ కటాక్షం ఆశీస్సులు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి కస్తూరి రాజన్న, సామాజిక సమరస జిల్లా ప్రముఖ్ రంగు శ్రీధర్, మండల కార్యదర్శి వెలగందుల బుచ్చన్న, సహాయ కార్యదర్శి కల్వకోట రాజు, నగర సహకార కార్యదర్శి వెలగందుల రవి, ఆసం సురేష్, చీపిరిశెట్టి దేవేందర్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించాలి

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం స్పందించకుంటే విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం అయ్యే పరిస్థితి నెలకొందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అక్రమాలిక్ ఆవేదన వ్యక్తంచేశారు. పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ జిల్లా కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భిక్షాటన చేశారు. అనంతరం అక్రమాలిక్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురీయంబర్స్‌మెంట్ బకాయిలు రూ.8500కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత నాలుగేళ్లుగా విద్యార్థులకు అందించాల్సిన రీయంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడంలో గత బీఆర్ఎస్‌తో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు రెండు వైఫల్యం చెందాయన్నారు. పేద విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తక్షణమే ఫీజురీయంబర్స్ విడుదల చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చదువులు పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పొందాలంటే పెండింగ్ బకాయిలు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకెళ్లాలని విద్యార్థులకు ప్రైవేట్ యాజమాన్యాలు చెప్పడంతో పేద విద్యార్థులు వారి తల్లితండ్రులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. పై చదువులు చదవాలంటే విద్యార్థులు ఇబ్బందులు పడాల్సివస్తుందన్నారు.

ప్రభుత్వం స్పందించకుంటే విద్యార్థుల భవిష్యత్తు రోడ్డున పడే ప్రమాదం ఉందని, ఇప్పటికే బీఏఎస్ పాఠశాలలో చదివే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రోడ్డెక్కిన ప్రభుత్వం స్పందించకుంటే విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ఏంటని, కనీసం ప్రభుత్వం ఎటువంటి మార్గదర్శకాలు విడుదల చేయకపోవడం వెనుక అంతర్యం ఏంటని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ సంఘ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ బాధ్యులు అక్రమాలిక్‌తో పాటు గణేష్, రేవంత్, షాకీబ్, సోహెల్, చరణ్, మణిదీప్, ముజీబ్ తదితరులున్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

కొడిమ్యాల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లగొండ గ్రామ రైతు ఐక్యవేదిక వద్ద చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం మంజూరు చేసిన హైమాస్ట్ లైట్లను బుధవారం పూడూర్ సింగిల్ విండో చైర్మన్ బండ రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. రైతు వేదిక వద్ద హైమాస్‌లైట్లను మంజూరు చేసిన చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ రమేష్, సింగిల్ విండో డైరెక్టర్ నాగభూషణ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నారాయణగౌడ్, మల్లిఖార్జున్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, నసీరొద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్, అజయ్‌రెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం

రాయికల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లీపూర్, సింగర్రావుపేట గ్రామాల్లో బుధవారం పొలాస వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేజీఎల్-24423 రకాన్ని సాగు చేసిన నల్లూరి లక్ష్మీ, జగదీశ్వర్ వరి పొలాన్ని సందర్శించి క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్తలు స్పందన, స్వాతి, ఏఈవో సతీష్‌లు చిన్నారెడ్డి సాగు చేసిన పసుపు పంటను పరిశీలించి దుంప తొలుచు ఈగ ఉందని తెలిపి కార్బోఫ్యూరాన్ 3% సీజీ గుళికలను ఎకరానికి 10 కిలోల చొప్పున వేయాలని సూచించారు. అలాగే మర్రి ఆకు తెగులును గమనించి, దీని నివారణకు ప్రోపికొనజోల్ మందును ఎకరానికి 200 మి.లీ. చొప్పున పిచికారి చేయాలన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రానికి భూమి కేటాయించాలి

ధర్మపురి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని తీగలధర్మారం గ్రామానికి వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి భూమి కేటాయించాలని రైతులు, యువకులు, ప్రజలు మండల తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్‌కు బుధవారం వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం, బర్రెల మందోట, క్రీడా ప్రాంగణం లాంటి అభివృద్ధి పనుల నిమిత్తం భూమి కేటాయించాలని అన్నారు. గతంలో తీగలధర్మారం గ్రామ శివారులో ఉండి, ప్రస్తుతం గాదెపల్లి శివారులో గల సర్వే నెంబర్ 274 లో గల దుబ్బల భూముల్లో గత పది ఏళ్ల నుండి తీగలధర్మారం, గాదెపల్లి, కొసునూర్‌పెల్ల రైతులకు సంబంధించిన ఖరీఫ్, రబీ సీజన్‌లో సుమారు 15 వేల క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు నిర్వహణ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ధర్మపురి ఏఎంసీ వైస్‌చైర్మన్ సంగ నర్సింహులు, మాజీ సర్పంచులు జంగిలి ప్రభాకర్, అయిల్నేని ఆండాళ-ప్రభాకర్‌రావు, పందిరి తిరుపతి, మాజీ ఉపసర్పంచులు పందిరి అశోక్, వేముల రఘుపతిరెడ్డి, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

మున్నూరుకాపుల ఆత్మీయ సమావేశానికి తరలిన నేతలు

జగిత్యాల టౌన్, అక్టోబర్, 29 (ఆంధ్రజ్యోతి) :హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన మున్నూరుకాపుల ఆత్మీయ సమావేశానికి జగిత్యాల జిల్లా నుంచి మజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ ఆధ్వర్యంలో మున్నూరుకాపులు తరలి వెళ్ళారు. జూబ్లిహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెండ్ కేటీఆర్, మాజీ మంత్రి ఎమ్మెల్యే గంగుల కమలాకర్ , మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, రాజ్యసభ సభ్యుడు ముద్దిరాజు రవి చంద్రతో పాటు పలువురు మున్నూరు కాపులు ఈ సమావేశంలో పాల్గొన్నట్లు దావ వసంత సురేష్ తెలిపారు.

యువ భారత్ కేంద్రం ఏర్పాటు చేయాలిని వినతి

రాయికల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధీనంలో జగిత్యాల జిల్లాలో మై భారత్ మేరా యువ భారత్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ రాయికల్‌కు చెందిన మోతె అంజయ్య నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు బుధవారం వినతి పత్రం పంపారు. 2016లో కొత్త జిల్లా ఏర్పడినప్పటికీ మై భారత్ మేరా యువ భారత్ కేంద్రం ఉమ్మడి జిల్లా కేంద్రంలోనే ఉందన్నారు.

సన్న వడ్ల బోనస్ విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న రైతులు

బుగ్గారం అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దునూర్ గ్రామ రైతులు రబీ సీజన్‌లో సన్న వడ్లకు ప్రభుత్వం ప్రకటించిన బోనస్ వెంటనే విడుదల చేయాలని బుగ్గారం మండల ఎక్స్ రోడ్డువద్ద రోడ్డుపైన ధర్నా చేపట్టారు. రైతుల ఆందోళనకు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకుడు మంచె రాజేష్, మండల అధ్యక్షుడు మేడవేణి శ్రీధర్ హాజరై, రైతులకు సంఘీభావం తెలిపారు. రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, బోనస్ మొత్తాలు తక్షణమే విడుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

మంత్రిని కలిసిన మార్కెట్ కమిటీ చైర్మన్

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ, మైనార్టి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ కలిసారు. బుధవారం హైదరాబాద్‌లోని మంత్రి చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా నియోజక వర్గంలోని రాజకీయ అంశాలపై మంత్రి అడిగి తెలుసుకున్నారన్నారు. నియోజక అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తూ సహకరిం చాలని ఏఎంసీ చైర్మన్ కోరినట్లు తెలిపారు. ఈయన వెంటా పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.